
సాక్షి నల్లగొండ
ఆదివారం। 24 । సెప్టెంబర్। 2023



**ఒకే మాట.. ఒక్కటే విగ్రహం**
మాడ్గులపల్లి మండలం కేశవాపురంలో గ్రామస్తులంతా కలిసి 40 ఏళ్లుగా ఒక్కటే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. - 8లో




**బ్యాండ్ ఖర్చు భరిస్తాం!**
గణేశ్ విగ్రహాలను పంపిణీ చేసిన నాయకులు ఇప్పుడు శోభాయాత్రకు వాహనంతో పాటు బ్యాండ్ మేళం సమకూరుస్తున్నారు. - 8లో



**వైద్యసేవలు అందించాలి**
పేదలకు వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందించి మన్ననలు పొందాలని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. - 10లో

# హస్తినకు ఆశావహులు



**కాంగ్రెస్ నేతల ఢిల్లీ బాట..**
- టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు
- ఏఐసీసీ పెద్దలను కలుస్తున్న నాయకులు
- నియోజకవర్గానికి ఇద్దరు ముగ్గురు చొప్పున అక్కడే మకాం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ ఆశావహులంతా ఢిల్లీ బాట పట్టారు. ఇప్పటికే చాలా మంది ఢిల్లీలో మకాం వేయగా, మరికొంత మంది హస్తినకు పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ టికెట్లను ఖరారు చేసేందుకు స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తోంది. దీంతో తమ బెర్త్‌ను దక్కించుకునే ప్రయత్నాల్లో ఆశావహులు నిమగ్నమయ్యారు. తమ బయోడెటాలు, తాము చేసిన పార్టీ కార్యక్రమాల ఫైళ్లను పట్టుకొని ఏఐసీసీ నేతల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు చొప్పున ఢిల్లీలో మకాం వేశారు. టికెట్ కోసం సంఖ్యాపరంగా ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నా ఢిల్లీకి వెళ్లిన వారిలో ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు చొప్పున ఉన్నారు. ఒకటీ రెండు నియోజకవర్గాలకు చెందిన వారు మినహా, మిగితా అన్ని నియోజకవర్గాలకు చెందిన ఆశావహులు ఢిల్లీల్లోనే ఉన్నారు. ఢిల్లీకి వెళ్లిన నేతలంతా కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులను కలుస్తున్నారు. రాష్ట్రానికి చెందిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీలు, స్క్రీనింగ్ కమిటీ సభ్యులైన ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మధుయాష్కీ గౌడ్, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ సెక్రటరీ మన్సూర్ అలీ, తెలంగాణ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ విష్ణునాథన్ తదితర నేతలను కలుస్తున్నారు.

**ఢిల్లీలో వీరే..**
మునుగోడు నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న పార్టీ అధికార ప్రతినిధి పున్నా కైలాష్‌నేత ఇప్పటికే ఢిల్లీలో మకాం వేయగా, చలమల్ల కృష్ణారెడ్డి, పాల్వాయి స్రవంతి త్వరలోనే ఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలిసింది. మిర్యాలగూడ నుంచి బత్తుల లక్ష్మారెడ్డి, భువనగిరి నుంచి జిట్టా బాలకృష్ణారెడ్డి కూడా త్వరలోనే ఢిల్లీకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ఆలేరు నుంచి బీర్ల అయిలయ్య, తుంగతుర్తి నుంచి అద్దంకి దయాకర్, ప్రీతం, సూర్యాపేట నుంచి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, మిర్యాలగూడ నుంచి రఘువీర్‌రెడ్డి, దేవరకొండ నుంచి రవినాయక్, భువనగిరి నుంచి శివరాజ్‌గౌడ్ తదితర నేతలు ప్రస్తుతం ఢిల్లీలోనే ఉండి తమ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అధిష్టానం టికెట్ ఎవరికి ఖరారు చేస్తుందన్నది మాత్రం అక్టోబరు మొదటి వారంలో తేలనుంది.

**వీరేశం పోటీ చేసే స్థానంపై చర్చ**
కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశంను కాంగ్రెస్ పార్టీ ఎక్కడి నుంచి పోటీలో దింపుతుందన్న దానిపైనే చర్చ సాగుతోంది. ఆయనను నకిరేకల్ నుంచి కాకుండా, తుంగతుర్తి నుంచి పోటీలో దింపాలన్న చర్చను పార్టీలో కొందరు నేతలు తీసుకువచ్చారు. తానను నకిరేకల్ నుంచి మాత్రమే పోటీ చేస్తానని, అక్కడ టికెట్ ఇస్తేనే కాంగ్రెస్ పార్టీలో చేరుతానని వీరేశం గతంలోనే పార్టీ నేతలకు స్పష్టం చేశారు. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని, మరో నియోజకవర్గం నుంచి చేయబోనని పేర్కొన్నారు. నకిరేకల్ టికెట్ ఇచ్చేందుకు ఓకే చెప్పడంతోనే శుక్రవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు.

## వీరేశం చేరిక.. మరికొంత ఆలస్యం



ఢిల్లీలో రేవంత్‌రెడ్డిని కలిసిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం



రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వీరేశం అనుచరులు

నకిరేకల్: మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కాంగ్రెస్ పార్టీలో చేరిక రెండు మూడు రోజులు ఆలస్యం కానుంది. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అందుబాటులో లేకపోవడం.. వీరేశం చేరిక ఆలస్యానికి కారణమని తెలిసింది. అప్పటి వరకు వీరేశం ఢిల్లీలో ఉండనున్నారు. శనివారం ఆయన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఢిల్లీలో కలిశారు. వీరేశంతో ఢిల్లీకి వెళ్లిన ఆయన అనుచరులు శనివారం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చిట్యాల వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కాటం వెంకన్న, నార్కట్‌పల్లి మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, కట్టంగూరు మాజీ జడ్పీటీసీ, ప్రస్తుత ఎంపీటీసీ మాద యాదగిరి, తాటికల్, గోరెంకలపల్లి ఎంపీటీసీలు గాదగోని శ్రీలత కొండయ్య, వీరార్జున్‌రెడ్డి, మర్రూర్, నెమ్మాని మాజీ సర్పంచ్‌లు నరేందర్, స్వామి, ఇనుపాముల ఎంపీటీసీ బొజ్జ సుందర్, కేతేపల్లి, చిట్యాల మాజీ ఎంపీపీలు గుత్తా మంజుల మాదవరెడ్డి, బట్టు అరుణఅయిలేష్, సీనియర్ నాయకులు గంగుల రాజిరెడ్డి, పుల్లెంల అచ్చాలు, కొండయ్య, గడ్డం పశుపతి, సత్తయ్యతో పాటు మరో 50 మందికి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పారు. అయితే వీరేశంకు ఇచ్చే స్థానం విషయంలోనే మరింత స్పష్టత కోసమే ఆగినట్లుగా తెలుస్తోంది.

**● గణపయ్య నిమజ్జనం**





నల్లగొండలోని వల్లభరావు చెరువులో శనివారం గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు

# 2న కేటీఆర్ రాక



- నల్లగొండ, సూర్యాపేట పట్టణాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభం, శంకుస్థాపన
- సాయంత్రం నల్లగొండలో ప్రగతి నివేదన సభ

నల్లగొండ టూటౌన్: రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అక్టోబర్ 2న ఉమ్మడి జిల్లా పర్యటనకు రానున్నారు. ఉదయం.. సూర్యాపేట పట్టణంలో, సాయంత్రం నల్లగొండ పట్టణంలో మంత్రి కేటీఆర్ పర్యటించనున్నారు. సూర్యాపేటలో ఐటీ హబ్‌కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం నల్లగొండకు చేరుకుని మర్రిగూడ బైపాస్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. రూ.116 కోట్లతో నల్లగొండ పట్టణంలో రూపుదిద్దుకున్న రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులకు ప్రారంభోత్సవం చేస్తారు. అదే విధంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఐటీ హబ్ భవనాన్ని కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అక్కడి నుంచి బీట్‌మార్కెట్ చేరుకొని అక్కడ నిర్మించిన సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రారంభిస్తారు.

**కళాభారతి, బండ్‌కు శంకుస్థాపన..**
నీలగిరి పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్ పక్కన నీలగిరి కళాభారతి భవనం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఇక్కడే.. ఉదయ సముద్రం బండ్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేస్తారు. ఉదయ సముద్రం వద్ద తీగల వంతెన నిర్మించడానికి ప్రతిపాదన రూపొందించిన విషయం తెలిసిందే. వీటితో పాటు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, అమృత్-2 తాగు నీటి పథకం, ఆర్‌అండ్‌బీ రీజినల్ కార్యాలయ భవన నిర్మాణం, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం భవనాలకు కూడా ఇక్కడే శంకుస్థాపన చేయనున్నారు. గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండను దత్తత తీసుకుంటానన్న హామీ మేరకు.. నీలగిరి పట్టణాభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. పట్టణంలో రహదారుల విస్తరణ, సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్, ఐటీ హబ్ రూపుదిద్దుకున్నాయి. కేటీఆర్ చేత అభివృద్ధి పనులను ప్రారంభించడానికి అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

**ప్రగతి నివేదన సభ**
2వ తేదీనే సాయంత్రం నీలగిరి పట్టణంలో నిర్వహించే ప్రగతి నివేదన సభలో కేటీఆర్ పాల్గొని బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారు. శాసన సభ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రగతి నివేదన సభ ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రణాళిక చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్‌జీ కాలేజీ మైదానంలో సభ నిర్వహించే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 26న చాకలి ఐలమ్మ జయంతి

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని ఈనెల 26న నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ తెలిపారు. సాగర్ రోడ్డులోని చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహానికి ప్రభుత్వం తరపున పూలమాలలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, చేతి వృత్తిదారుల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 2వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ చినపాక లక్ష్మీనారాయణ శనివారం అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో 44 రోజుల పాటు నిర్వహించిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. అందుకే మళ్లీ మరో పోరాటానికి సిద్ధం కావాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి పోతెపాక వినోద్‌కుమార్, పోలె సత్యనారాయణ, అంజయ్య, ఇరిగి ఎల్లేష్, కాసర్ల స్వప్న తదితరులు పాల్గొన్నారు.


### యూరియా అందుబాటులో ఉంది



పత్తి చేనును పరిశీలిస్తున్న డీఏఓ

చింతపల్లి, చందంపేట : రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడు గ్రామంలో ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. చందంపేట మండలంలోని యల్మలమంద గ్రామంలో ఆయన పత్తి, మిరప పంటలను పరిశీలించారు. కంబాలపల్లిలో పంట రుణమాఫీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా విషయంలో ఆందోళన పడొద్దన్నారు. సరిపడా యూరియా ప్రస్తుతం అందుబాటులో ఉందని తెలిపారు. ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లు ఈ పాస్ మిషన్ ద్వారా ఆధార్ కార్డుతో రైతులకు యూరియా సరఫరా చేయాలని సూచించారు. చందంపేట మండలంలోని చిత్రియాల పీఏసీఎస్‌లో 20 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఆయన వెంట చింతపల్లి ఏఓ రామలింగేశ్వరరావు తదితరులున్నారు.

### సేంద్రియ సాగుతో మేలు



వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కనగల్ : విచక్షణా రహితంగా రసాయనాల వినియోగం వల్ల నేల, నీరు, గాలి, ఆహారం కలుషితమవుతుందని భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన నేలను అందించాలంటే సాగులో సేంద్రియ పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సంగీతలక్ష్మి పేర్కొన్నారు. నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనగల్ మండల పరిధిలోని నరసింహాపురం గ్రామానికి చెందిన రైతు జెల్లాపుండరీకం వ్యవసాయ క్షేత్రంలో శనివారం నిర్వహించి అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అనంతరం రైతు పుండరీకం పట్టు పురుగుల పెంపకం, సేంద్రియ సాగులో ఉపయోగించే కషాయాలు, ద్రావణాల తయారీ విధానాన్ని వివరించారు. శిక్షణకు హాజరైన రైతులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రముఖ సేంద్రియ రైతు అంజిరెడ్డి, నల్లగొండ జిల్లా సెరికల్చర్ ఏడీ లక్ష్మయ్య, రంగారెడ్డి జిల్లా సెరికల్చర్ ఏడీ ముత్యాలు, నాబార్డు జిల్లా మేనేజర్ సత్యనారాయణ, హార్టికల్చర్ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి, ఏఓ అమరేందర్‌గౌడ్, రైతునేస్తం ఫౌండేషన్ మేనేజర్ ప్రసాద్, చైర్మన్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## క్రీడా ప్రాంగణాలకు స్థలాలు గుర్తించాలి

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్
- ఎన్నికలు, ధరణి, క్రీడా ప్రాంగణాలు తదితర అంశాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ : గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, గ్రామ పంచాయతీ భవనాలకు స్థలాలను గుర్తించాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి ఎన్నికలు, ధరణి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఇళ్ల పట్టాల పంపిణీ, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, గ్రామపంచాయతీ భవనాలు, 58 59 జీఓలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ఎన్నికల పనులతో పాటు ఇతర అభివృద్ధి సంక్షేమ పనులుపై శ్రద్ధ వహించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధరణికి సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద లబ్ధిదారులకు వెంటనే చెక్కులు అందజేయాలని సూచించారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలన్నారు. 58, 59 జీఓల ప్రకారం స్థలాలను రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓలు రవి, శ్రీరాములు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.దీప్తి

రామగిరి(నల్లగొండ) : మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు రూపొందించబడ్డాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. దీప్తి అన్నారు. శనివారం తిప్పర్తి మండలంలోని మోడల్ స్కూల్‌లో మహిళల అక్రమ రవాణా, లైంగిక దాడులపై నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాలన్నారు. లైంగిక దాడులకు గురైన మహిళలకు న్యాయం చేసేందుకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ వారికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ టి. నిర్మల, భరోసా ఎస్ఐ అంజలి, సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ ఎం. మందాకిని, ఎస్ఐ ఎస్. ధర్మా, ప్రిన్సిపాల్ పోతురాజు నరహరి, అధ్యాపకులు టి. జగదీష్, భారతి, వరలక్ష్మి, రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధానంపై అవగాహన ఉండాలి

- అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నల్లగొండ : విద్యార్థి దశలోనే ఎన్నికల విధానంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో కవిత్వం, గేయ రచన, పాటలు నాటక ప్రదర్శనలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ ఓటర్లుగా మారనున్న యువత ఎన్నికల విధానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో 22 విద్యాసంస్థల నుంచి 150 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో పోటీలు నిర్వహించారు. నాటక ప్రదర్శన జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.10000 నకిరేకల్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, రెండవ బహుమతి రూ.8000 చర్లపల్లి రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, మూడో బహుమతి రూ.5000 నల్లగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గెలుపొందారు. కవిత్వం, గేయ రచనల పోటీలకు మొదటి బహుమతి రూ.5000 ఎస్.ప్రియాంక (ఒకేషనల్ జూనియర్ కళాశాల నల్లగొండ), రెండో బహుమతి రూ.4000 మనోజ్ఞ (రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల చర్లపల్లి), మూడో బహుమతి రూ.3000 జి.రేణుకగౌడ్ (జూనియర్ కళాశాల నలగొండ) గెలుపొందారు. విజేతలకు మెమోంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి, డీఈఓ భిక్షపతి, ఆర్డీఓ రవి, న్యాయనిర్ణేతలు పురుషోత్తమాచార్యులు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి నిరాశ

- గ్రూప్ -1 పరీక్షను రద్దు చేసిన హైకోర్టు
- టీఎస్‌పీఎస్సీపై అభ్యర్థుల విమర్శలు
- సమయం వృథా.. ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన



నల్లగొండ లైబ్రరీలో గ్రూప్-1 మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు

నల్లగొండ : గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు కావడంపై అభ్యర్థులు మరోసారి నిరాశ చెందారు. బయోమెట్రిక్ తీసుకోకుండా, ఓఎంఆర్ షీట్‌పై హాల్ టికెట్ నంబర్ లేకుండా పరీక్ష నిర్వహించారని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు పరీక్షను రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని కొందరు అభ్యర్థులు స్వాగతిస్తుండగా.. ఏళ్ల తరబడి డబ్బులు ఖర్చు చేసి ప్రిపేర్ అయిన పరీక్ష రాసిన అభ్యర్థులు మాత్రం ఆందోళనకు గురవుతున్నారు. గ్రూప్-1కు నల్లగొండ జిల్లాలో 16,095 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 11వ తేదీన నిర్వహించిన ప్రిలిమ్‌కు 11,414 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష రద్దు కావడంతో అభ్యర్థులు మళ్లీ ప్రిపేర్ అయి పరీక్ష రాయాల్సి ఉంటుంది.

**ఆందోళనలో అభ్యర్థులు..**
గ్రూప్-1 ప్రిలిమ్స్ మొదటి సారి నిర్వహించినప్పుడు అభ్యర్థుల బయో మెట్రిక్ తీసుకున్నారు. అప్పుడు పేపర్ లీక్ అయిన కారణంగా పరీక్ష రద్దయింది. రెండో సారి పరీక్ష నిర్వహణ సమయంలో బయోమెట్రిక్ తీసుకోలేదు, ఓఎంఆర్ షీట్‌పై అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లు ఇవ్వలేదు. దీంతో మళ్లీ పరీక్ష రద్దయింది. రెండు సార్లు పరీక్ష రద్దు కావడంతో ఇప్పటికే రెండుసార్లు పరీక్షకు ప్రిపేర్ కావడానికి లక్షల రూపాయలు ఖర్చుపెట్టి పట్టణాల్లో గదులు అద్దెకు తీసుకొని చదువుకున్నామని, రాసిన పరీక్ష రద్దు కావడంలో మళ్లీ ప్రిపేర్ కావాటంటే ఆర్థికంగా ఖర్చు చేయాల్సి వస్తోందని నిరుద్యోగ అభ్యర్థులు ఆవేదన చెందుతన్నారు. మొదటిసారి తప్పు జరిగినప్పుడే టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేసి పరీక్షలు నిర్వహిస్తే బాగుండేదని.. ఇప్పటికైనా బోర్డును రద్దు చేసి పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

### టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దుచేయాలి



మొదటిసారి పరీక్ష నిర్వాహణలో తప్పులు జరిగినప్పుడే టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేసి పరీక్ష నిర్వహిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు. మమ్ముల మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. పిల్లలను ఇంటి వద్ద వదిలేసి ఎంతో డబ్బు ఖర్చు పెట్టుకొని రోజూ హాలియా నుంచి నల్లగొండ లైబ్రరీకి వస్తున్నాను. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే బోర్డును రద్దుచేసి గ్రూప్-1 పరీక్షను సజావుగా నిర్వహించాలి.

– రమావత్ అంజలి, హాలియా

### మా జీవితాలతో ఆడుకుంటున్నారు



మాది ఇనుపాముల గ్రామం 15 నెలల పాపను మా అమ్మ వద్ద వదిలి రోజూ నల్లగొండకు వచ్చి లైబ్రరీలో చదువుకుంటున్నాను. రెండుసార్లు గ్రూప్-1 పరీక్ష రాశాను. రెండవ సారి కూడా పరీక్ష రద్దయింది. టీఎస్‌పీఎస్సీ బోర్డు మా జీవితాలతో ఆడుకుంటోంది. ఎంతో ఖర్చు పెట్టుకుని, ఎన్నో ఇబ్బందులు పడతుతూ రెండేళ్ల నుంచి చదువుతున్నా. ఈ సారైనా పరీక్షను సరిగా నిర్వహించాలి.

– మౌనిక, ఇనుపాముల, నకిరేకల్ మండలం

### పరీక్ష రద్దును స్వాగతిస్తున్నా



గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దును స్వాగతిస్తున్నా. పరీక్ష నిర్వహణ తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. పరీక్షను రద్దు చేయడం మంచి పరిణామమే. పరీక్ష కోసం అభ్యర్థులు ఏళ్ల తరబడి ఆర్థికంగా ఎంతో ఖర్చు చేశారు. మళ్లీ ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ విషయంలో అభ్యర్థులకు ఆర్థికంగా సహాయం అందిస్తే బాగుంటుంది. ఈ సారైనా పకడ్బందీగా పరీక్ష నిర్వహించాలి.

– రఘు, నల్లగొండ

### ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదు



నేను రెండు సంవత్సరాల నుంచి హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉండి చదువుతున్నా. రెండుసార్లు గ్రూప్-1 ప్రిలిమ్స్ రాశా. ఈ సారి మెయిన్స్ రాసి ఉద్యోగం సాధించి పెళ్లి చేసుకుందాం అనుకున్నా. ఇప్పటికే 30 సంవత్సరాలు వచ్చాయి. ఉద్యోగాల కోసం కష్టపడి చదువుతున్నా అవి వచ్చే పరిస్థితి లేవు. ఇలా అయితే ఎప్పుడు స్థిర పడాలో తెలియడం లేదు.

– జిల్రిపోతుల సంతోష్, మాదారంకలాన్

### నిరుద్యోగుల జీవితాలు నాశనమవుతున్నాయి



తెలంగాణ ప్రభుత్వ తీరుతో నిరుద్యోగుల జీవితాలు నాశనమవుతున్నాయి. ఇద్దరు చిన్న పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించి రోజుకు పది నుంచి పన్నెండు గంటల పాటు చదివా. కోచింగ్ కోసం వేలాది రూపాయలు వెచ్చించా. వేరే జిల్లాలో పరీక్ష కేంద్రం వేయడంతో అక్కడికి వెళ్లి గ్రూప్-1 పరీక్ష రాశా. రేయింబవళ్ల నా శ్రమ వృథా అయింది. బీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత సాధించినా.. స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌కు అర్హులు కారంటూ మరో ప్రకటన వెలువడడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నా.– సరికొండ కోమల, మిర్యాలగూడ

### పరీక్ష రద్దు బాధాకరం



గ్రూపు-1 ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడం బాధాకరం. వేలాది రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకొని గ్రూపు-1 పరీక్ష రాసిన అభ్యర్థులపై మళ్లీ ఆర్థిక భారం పడుతుంది. నేను ఈ సారి ఎంతో గ్రూపు-1 ప్రిలిమ్స్ పరీక్ష రాశాను. మెయిన్స్‌కు క్వాలిఫై అవుతాననే నమ్మకం ఉంది. తీరా ఫలితాలు వెలువడే సమయంలో పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడం నాలాంటి వారికి తీరని నష్టమే.

– గుంటుక రామాంజిరెడ్డి, పెద్దవూర

### పరీక్ష రద్దు నిరాశ కలిగించింది



గ్రూప్-1 ప్రిలిమ్స్ మరోమారు రద్దు కావడంతో తీవ్ర నిరాశ కలిగింది. నేను బీటెక్ పూర్తి చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను దృష్టిలో పెట్టుకొని ముందు నుంచే కోచింగ్ తీసుకున్నాను. పరీక్ష నిర్వాహణలో టీఎస్‌పీఎస్సీ పారదర్శకతను పాటించి ఉంటే పరీక్ష రద్దయి ఉండేది కాదు.

– ప్రసాద్, కొండమల్లేపల్లి

### గ్రూప్-1 రద్దు మంచిదే



గ్రూప్-1 పరీక్ష రద్దు చేయడం మంచిదే. నేను కూడా పరీక్ష రాశాను. గతంలో బయోమెట్రిక్ తీసుకునే వారు. ఈసారి నిర్వహించిన ఈ పరీక్షలో బయోమెట్రిక్ తీసుకోలేదు. ఆధార్ కార్డు, హాల్ టికెట్ చూపిస్తే పరీక్ష సెంటర్‌లోకి అనుమతి ఇచ్చారు. దీనివల్ల ఒకిరికి బదులు మరొకరు పరీక్ష రాసే అవకాశాలు ఉన్నాయి. ఇలా ఎంతమంది ఒకరికి బదులు మరొకరు గ్రూప్-1 పరీక్ష రాసి ఉండొచ్చు. నేడు పరీక్ష రద్దుతో ప్రతిభ కలిగిన వారికే మళ్లీ ఉద్యోగాలు దక్కుతాయి.

– వెల్మకంటి విజయ్, నకిరేకల్

## క్లుప్తంగా

### పాత కక్షలతో వ్యక్తిపై దాడి

రామగిరి(నల్లగొండ): పాత కక్షలు దృష్టిలో ఉంచుకొని వ్యక్తిపై దాడి జరిగిన ఘటన తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. తిప్పర్తి పంచాయతీ పరిధిలోని నూకలవారిగూడేనికి చెందిన నూకల వెంకన్న, నూకల మహేష్ అన్నదమ్ముల పిల్లలు. వీరిద్దరికీ భూ వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వెంకన్న శుక్రవారం అర్ధరాత్రి మహేష్ ఇంటి ముందు నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మహేష్ కర్రతో వెంకన్నపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దాడిలో వెంకన్న తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. వెంకన్న తల్లి అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్. ధర్మా తెలిపారు.

### గాయపడిన యువకుడి మృతి


సందీప్ (ఫైల్)

శాలిగౌరారం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామానికి చెందిన మాచర్ల యాదగిరి–ఆగ్నేషా దంపతులకు ఇద్దరు కూతుళ్లతో పాటు కుమారుడు సందీప్(28) ఉన్నాడు. సందీప్ ఈనెల 12న రాత్రి వ్యక్తిగత పనిపై బైక్‌పై నకిరేకల్‌కు వెళ్తున్న క్రమంలో పెర్కకొండారం–కడపర్తి శివారులో రోడ్డుపై అడ్డంగా పెట్టిన ప్రొక్లెయిన్‌ను వెనుక నుంచి ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడటంతో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడకు వచ్చిన ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టించింది.

# ఒకే మాట.. ఒక్కటే విగ్రహం

- కేశవాపురంలో ఏకదంతుడి విగ్రహం ఏర్పాటు
- కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా పూజలు
- నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ


వినాయక మండపం వద్ద భజన చేస్తున్న గ్రామస్తులు

మాడుగులపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాలు వస్తే వాడవాడలో సందడే. మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరించి వీధికో విగ్రహం పెట్టి నిర్వాహకులు చేసే హడావిడి మామూలుగా ఉండదు. డీజే పాటలు, నృత్యాలు, ఇతర వినోద కార్యక్రమాలతో తారాస్థాయి హంగామా ఉంటుంది. ఖర్చుకు వెనుకాడకుండా దర్పం ప్రదర్శించేందుకు ఒకరికొకరు పోటీ పడుతుంటారు. ఇలాంటి పరిస్థితులున్న ప్రస్తుతం తరుణంలోనూ మాడుగులపల్లి మండలంలోని కేశవాపురం గ్రామస్తులు ఇందుకు పూర్తి భిన్నంగా చవితి వేడుకలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**ప్రత్యేకత ఇదే..**

కేశవాపురం (పెద్దపాడు) గతంలో ఉమ్మడి కన్నెకల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవాస గ్రామం. ఏడు సంవత్సరాల క్రితం ప్రభుత్వం 500లోపు జనాభా ఉన్న గ్రామాలను పంచాయతీలుగా గుర్తించడంతో ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటైంది. 1981 నుంచి గ్రామస్తులు ఇక్కడ చవితి వేడుకలను నిరాడంబరంగా నిర్వహిస్తున్నారు. 40 ఏళ్ల క్రితం పెద్దలు నిర్ణయించిన విధంగానే ఇప్పటికీ ఒకే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి ఈ విగ్రహం వద్దే పూజలు నిర్వహిస్తారు. మండపం వద్ద డీజేలు, నృత్యాలు కాకుండా భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తారు. 2002 వరకు ఇంటింటికీ చందాలు పోగేసి వేడుకలు నిర్వహించారు. ఆ తరువాత నుంచి లడ్డూ వేలంపాట ద్వారా వచ్చిన మొత్తాన్నే మరుసటి ఏడాది వేడుకల నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు.

### ఆనవాయితీ కొనసాగిస్తున్నాం



గ్రామస్తులంతా కలిసిమెలిసి ఉండాలన్న ఉద్దేశంతో 40 ఏళ్ల క్రితం పెద్దలు గ్రామంలో ఒకే వినాయక విగ్రహం పెట్టాలని నిర్ణయించారు. అప్పటి నుంచి ఈ ఆనవాయితీనే కొనసాగిస్తున్నాం. కులమతాలు, రాజకీయాలకుఅతీతంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. గ్రామస్తుల ఐక్యత కారణంగానే నాలుగు దశాబ్దాలుగా విజయవంతంగా వేడుకలు జరుగుతున్నాయి.

– గనిపెల్లి మోహన్, కేశవాపురం గ్రామస్తుడు

### నిరాడంబరంగా వేడుకలు చేస్తాం



గ్రామంలో వినాయక చవితి వేడుకలను నిరాడంబరంగా నిర్వహిస్తాం. డీజేలు, మైకులు, ఇతరాత్ర వినోద కార్యక్రమాలకు తావులేకుండా భజనలు, కోలాటాలకు ప్రాధాన్యం ఇస్తాం. ఉత్సవ కమిటీ నిర్ణయం మేరకు అందరం నడుచుకుంటాం. ఒకరినొకరం గౌరవించుకుంటూ ఐక్యంగా ముందుకు సాగుతాం. భక్తులకు అన్నదానం చేసేందుకు మాత్రమే దాతల సహకారం కోరతాం.

– నెర్మటి వెంకట్‌రెడ్డి, కేశవాపురం సర్పంచ్

## 45 ఏళ్లుగా గణనాథుడి సేవలో..

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని నేతాజీ యువజన సంఘం సభ్యులు 45 ఏళ్లుగా గణనాథుడి సేవలో తరిస్తున్నారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోనే మొట్టమొదటి సారిగా నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నాటి నుంచి నేటి వరకు నిర్విరామంగా ప్రతిఏటా గణనాథుడిని ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నారు. మొదట్లో హైదరాబాద్‌లోని, ధూళిపేటలో ఆర్డర్ ఇచ్చి వెయ్యి రూపాయలకు 5 అడుగుల వినాయక విగ్రహాన్ని తయారుచేయించి ఇక్కడికి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అప్పట్లో ఒక్కటే వినాయక విగ్రహం ఉండటంతో ఊరంతా ఇక్కడికి వచ్చి గణనాథుడిని దర్శించుకునేది. మూడు, లేదా ఐదు రాత్రులను పురస్కరించుకొని భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అంతేకాక దాతల సహకారంతో భక్తులకు మహాన్నదానం చేస్తున్నారు. కాగా పోచంపల్లి పర్యటనకు వచ్చిన అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, పతిపక్ష నేతగా ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, దివంగత మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి, మాజీ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయడం విశేషం.


గణపతి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

### మొదటి విగ్రహం మాదే..



పోచంపల్లిలోనే మొదట నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. గతంలో ముంబాయి, హైదరాబాద్ లాంటి మహానగరాల్లో ప్రతిష్ఠించేది. అయితే పోచంపల్లిలో కూడా గణేశ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నాడు సంఘం అధ్యక్షుడిగా ఉన్న గునిగంటి సుదర్శన్ నిర్ణయించారు. అప్పట్లో ఊరంతా ఇక్కడికి వచ్చి వినాయకుడిని పూజించేది. చాలా మంది ప్రముఖులు మా వినాయకుడిని దర్శించుకొని పూజలు చేశారు.

– బాలయ్యగౌడ్, నేతాజీ యువజన సంఘం గౌరవ సలహాదారుడు, భూదాన్‌పోచంపల్లి

## మార్కండేయ దేవాలయంలో ..

- గణేశ్ నవరాత్రి వేడుకలు

రాజాపేట : రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ భక్తమార్కండేయ దేవాలయంలో 45 ఏళ్లుగా గణేశ్ నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో వినాయక విగ్రహ ఏర్పాటును అప్పటి పద్మశాలీ కులస్తులు 1979లో దాత రవ్వ నర్సింహులు ద్వారా ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటివరకు భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా శ్రీ గణనాధుడిని ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఆనాడు దాతల సహాయంతో విరాళాలు సేకరించి అందులో ఖర్చుపోను మిగిలిన డబ్బులు రొటేషన్ పద్ధతి ద్వారా కొనసాగించారు.

### ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసుకుంటాం



పద్మశాలీ కులస్తులమంతా కలిసి వినాయకుడి విగ్రహం ఏర్పాటుకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసుకుంటాం. వినాయకుడి వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ, ఫలం ద్వారా వచ్చిన డబ్బులతో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం.

– ఆడెపు శ్రీశైలం, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాజాపేట


రాజాపేటలో వినాయకుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున భక్తులు

## విభిన్నమైన మండపం సెట్టింగులతో..

- చౌటుప్పల్‌లోని గాంధీ పార్కు ఆవరణలో 1975 నుంచి గణేశ్ నవరాత్రి ఉత్సవాలు
- మొదటి పదేళ్లు ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో..
- 1985 నుంచి శివాజీ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు


చౌటుప్పల్‌లోని గాంధీపార్కులో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం సెట్టింగ్

చౌటుప్పల్: పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీపార్కులో గత 49 ఏళ్లుగా వినాయక చవితి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. 1975లో ఇక్కడ వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదట్లో ఆదర్శ యూత్ పేరిట వేడుకలు జరిగేవి. దివంగత మాజీ సర్పంచ్ గోశిక వెంకటేశం ఇక్కడ మండపాన్ని ఏర్పాటు చేసి చవితి వేడుకలకు అంకురార్పన చేశారు. పదేళ్ల పాటు అదే యూతత్ ఆధ్వర్యంలో, అతడి సారథ్యంలోనే ఉత్సవాలు జరిగాయి. ఆ తర్వాత 1985 సంవత్సరం నుంచి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది విభిన్నమైన సెట్టింగ్‌లతో మండపం ఏర్పాటు చేయడం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ నెలకొల్పే వినాయక విగ్రహాలు అప్పట్లో ఈ ప్రాంతంలోనే అత్యంత ఎత్తైనవిగా గుర్తింపు పొందాయి. 1996లో 16 ఫీట్ల విగ్రహాన్ని హైదరాబాద్ నుంచి తీసుకువచ్చే క్రమంలో విద్యుత్ ప్రమాదాలు జరిగాయి. విగ్రహాన్ని తీసుకువస్తున్న డీసీఎం పలు ప్రాంతాల్లోని రైల్వే బ్రిడ్జిల కింద నుంచి రాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో అప్పటి నుంచి నిర్వాహకులు విగ్రహం ఎత్తు తగ్గించి మండపాన్ని భారీ సెట్టింగ్‌లతో అలంకరించే అంశానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

### ప్రత్యేక గుర్తింపు ఉంది



గాంధీ పార్కు ఆవరణలో వినాయక చవితి ఉత్సవాలను గత 39ఏళ్లుగా నిర్వహిస్తున్నాం. అంతకు ముందు పదేళ్ల పాటు ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. మొదట్లో విగ్రహం ఎత్తుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వగా ప్రస్తుతం మండపం అలంకరణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. చౌటుప్పల్ పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు అనగానే శివాజీ యూత్ అనే విధంగా ప్రత్యేక గుర్తింపు లభించింది.

– గుజ్జుల సురేందర్‌రెడ్డి, శివాజీ యూత్ అధ్యక్షుడు, చౌటుప్పల్







### అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


ఆలంపల్లి శేఖర్ (ఫైల్)


మాడుగులపల్లి: అప్పుల బాధ తాళలేక గడ్డి మందు తాగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన మాడుగులపల్లి మండలంలోని నారాయణపురం గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపురం గ్రామానికి చెందిన ఆలంపల్లి శేఖర్ (48)కు భార్య జానమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కొన్నేళ్లుగా తనకున్న ఎకరం భూమిలో వ్యవసాయం చేస్తూ స్థానికంగా ఓ భూస్వామి వద్ద జీతం చేస్తున్నాడు. ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్లు, కుటుంబ అవసరాలకు సుమారు రూ.8 నుంచి 10 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు పెరగడం, మూడు నెలలుగా చేసేందుకు పనిసైతం లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో శేఖర్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 21న (గురువారం) ఉదయం పొలం వద్దకు వెళ్లి గడ్డి మందు తాగాడు. స్థానికులు గుర్తించి అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఆలంపల్లి శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### చిరుత పులి పిల్లలా.. అడవి పిల్లులా ?

- దామరచర్ల మండలం ఇర్కిగూడెంలో పాదముద్రల కలకలం


పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ, పోలీసుశాఖ అధికారులు

మిర్యాలగూడ: దామరచర్ల మండలం ఇర్కిగూడెంలోని కృష్ణా పరీవాహక ప్రాంతంలో చిరుత పులి పిల్లలవిగా భావిస్తున్న పాదముద్రలు కలకలం రేపాయి. స్థానికులు ఫారెస్ట్, పోలీసు శాఖల అధికారులకు సమాచారం ఇవ్వడంతో శనివారం ఇర్కిగూడెం అటవీ పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి పక్కన కృష్ణానది సమీపంలో రెండు చిరుతపులి పిల్లలు తిరుగుతున్నాయని కొందరు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, పోలీసు అధికారులు పరిసర ప్రాంతాలను గాలించారు. పాదముద్రలను పరిశీలించి ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. అవి చిరుత పిల్లలు కావని అడవి పిల్లికి చెందిన పాదముద్రలుగా ఫారెస్ట్ అధికారులు భావిస్తున్నారు. రాత్రి వేళ అటవీ సిబ్బందిని నిఘా ఉంచామని, అవి పులి పిల్లలా, అడవిపిల్లులా అనేది నిర్ధారణ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ఆనంద్‌రెడ్డి, మిర్యాలగూడ సీఐ సత్యనారాయణ, వాడపల్లి ఎస్ఐ రవికుమార్, బీట్ ఆఫీసర్ ముఖేష్, బీట్ ఆఫీసర్లు ప్రవీణ్‌కుమార్, ఆజం పాల్గొన్నారు.


చిరుత పులి పిల్లదిగా గ్రామస్తులు అనుమానిస్తున్న పాదముద్ర

### గణేశ్ శోభాయాత్రలో కత్తిపోట్లు

- ఒకరికి తీవ్ర గాయాలు
- గంజాయి మత్తులో దాడి

మిర్యాలగూడ అర్బన్: గణేశ్ శోభాయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. గంజాయి మత్తులో ఓ వ్యక్తి మిర్యాలగూడ డీసీఎం యూనియన్ జనరల్ సెక్రటరీ వెంకన్నపై కత్తితో దాడి చేశాడు. మిర్యాలగూడ పట్టణంలోని వాసవీనగర్‌లో నివాసముంటున్న సుంకరబోయిన వెంకన్న డీసీఎం డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి శనివారం నిర్వహిస్తున్న శోభాయాత్రలో పాల్గొన్నాడు. వాడపల్లిలో వినాయకుడిని నిమజ్జనం చేసే క్రమంలో పట్టణంలో నిర్వహిస్తున్న శోభాయాత్రలో మిర్యాలగూడ మండలం తుంగపాడుకు చెందిన నాగరాజు కూడా పాల్గొన్నాడు. నాగరాజు గంజాయి మత్తులో డీజేకు అనుగుణంగా నృత్యం చేస్తూ శోభాయాత్రను ముందుకు సాగనివ్వడం లేదు. దీంతో శోభాయాత్ర నిర్వాహకులు డీజేని ఆపి ముందుకు సాగుతున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన నాగరాజు వెంట తెచ్చుకున్న కత్తితో వెంకన్నపై దాడి చేశాడు. గమనించిన కొందరు నాగరాజుని అడ్డుకుని గాయపడిన వెంకన్నను ఆస్పత్రికి తరలించారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్నను డీఎస్పీ వెంకటగిరి కలిసి దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు.

## విగ్రహాలు ఇచ్చాం.. బ్యాండ్ ఖర్చూ భరిస్తాం !

- గణేశ్ శోభాయాత్రకు వాహనాలు సైతం సమకూరుస్తాం
- ఎన్నికల వేళ యువతకు నేతల గాలం
- శోభాయాత్ర వాహనానికి తమ ఫొటోతో కూడిన ఫ్లెక్సీ పెట్టాలని షరతు

నల్లగొండ టూటౌన్ : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు యువతను ఆకర్షించేందుకు కొత్త దారులు వెతుకుతున్నట్లు తెలిసింది. అందుకు గణేశ్ నవరాత్రి ఉత్సవాలను లక్ష్యంగా చేసుకుని ఎవరికి వారు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గణేశ్ విగ్రహాలను పోటీ పడి పంపిణీ చేసిన ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు.. ఇప్పుడు గణేశ్ శోభాయాత్రకు వాహనంతో పాటు బ్యాండ్ మేళం కూడా సమకూరుస్తామంటూ యువతకు గాలం వేస్తున్నట్లు సమాచారం.

**ఖర్చంతా మాదేనంటూ..**


నవరాత్రి వేడుకల అనంతరం నీలగిరి పట్టణంలో గణేశ్ శోభాయాత్రను వైభవంగా నిర్వహిస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని వివిధ పార్టీల తరఫున ఎమ్మెల్యే అభ్యర్థులుగా రంగంలోకి దిగాలనుకుంటున్న ఆశావహులు ఈ సారి మరో ముందడుగు వేశారు. కేవలం విగ్రహం ఒక్కటే కాకుండా గణేశ్ విగ్రహాల శోభాయాత్ర సందర్భంగా పెద్ద ఎత్తున ప్రచారం పొందేందుకు ఆయా పార్టీలకు చెందిన వారు ఊరేగింపు కోసం వాహనాలు, బ్యాండ్ మేళాలను సైతం సమకూరుస్తామంటూ ముందుకొస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. శోభాయాత్ర రోజున గణేశ్ విగ్రహాన్ని కాలనీ అంతటా ఊరేగిస్తుండడంతో మహిళలు, యువతలో తమకు జోరుగా ప్రచారం లభించే అవకాశం ఉందని భావిస్తున్నారని తెలిసింది. అయితే, సదరు గణేశ్ శోభాయాత్ర వాహనానికి సదరు నాయకుడి ఫొటోతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని షరతు పెడుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే యువత బ్యాండ్ మేళాలను మాట్లాడుకోవడంతో దానికి అయ్యే ఖర్చంతా తామే భరిస్తామని, శోభాయాత్ర పూర్తయ్యే వరకు తమ ఫొటోల ఫ్లెక్సీలను వాహనాలకు పెట్టాలని చెబుతుండడం విశేషం. ఒక్కో బ్యాండ్ మేళానికి రూ.30 వేల నుంచి 50వేల వరకు ఖర్చు అవుతుంది. అదే విధంగా ట్రాక్టర్, డీసీఎంలకు సైతం భారీగా ఖర్చు కానుంది. విగ్రహాలు ఎవరి దగ్గర తీసుకున్నా పర్వాలేదు .. తమ దగ్గరికి వస్తే వాహన ఖర్చులు, బ్యాండ్ సమకూరుస్తామంటూ యువతను ఆకర్శిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కొందరు నాయకులు పేదలు చనిపోతే రూ.10వేలు, రూ.20వేల వరకు పంపుతున్నారు. వాటితో పోల్చుకుంటే గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రజలు రోజంతా చూస్తారనే ప్రధాన ఉద్దేశంతోనే నాయకులు ఖర్చుకు వెనుకాడడం లేదని తెలుస్తోంది.

### దినసరి కూలీ మృతి

కట్టంగూర్ : మండలంలోని పామనగుండ్ల గ్రామంలో ప్రమాదవశాత్తు దినసరి కూలీ మృతిచెందాడు. తిప్పర్తి మండలం సర్వారానికి చెందిన వీరయ్య (42) కాంట్రాక్టర్ కింద కూలీగా పనిచేస్తున్నాడు. పామనగుండ్లలో విద్యుత్ స్తంభాలకు నూతన వైర్లు లాగుతున్నారు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే విద్యుత్ సరఫరా నిలిపివేసి కూలీలు పనులు చేస్తున్నారు. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో వీరయ్య వైరు లాగుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. తోటి కార్మికులు నల్లగొండ ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎల్‌సీ తీసుకుని వైర్లు లాగుతున్నప్పటికీ ఇన్వర్టర్ల ద్వారా రివర్స్‌లో విద్యుత్ ప్రసరణ జరిగి ఇండెక్షన్‌తో వీరయ్య మృతిచెంది ఉంటాడనని అధికారులు అనుమానిస్తున్నారు.

## ట్రాక్టర్ రివర్స్ తీస్తుండగా ప్రమాదం

- వ్యక్తి పైనుంచి టైరు వెళ్లడంతో మృతి
- చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో విషాదం


సంజీవరెడ్డి(ఫైల్)

చౌటుప్పల్ : ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ వ్యక్తి బలయ్యాడు. చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దండుమల్కాపురం గ్రామానికి చెందిన అత్తాపురం సంజీవరెడ్డి (65)కి ట్రాక్టర్ ఉంది. స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో మట్టితోలేందుకు కిరాయికి వెళ్లాడు. పరిశ్రమలో ఎత్తుగా ఉన్న ప్రదేశంలో మట్టి అన్‌లోడ్ చేయాల్సి వచ్చింది. తనకు ట్రాక్టర్‌ను రివర్స్ తీయడం రాకపోవడంతో మరో ట్రాక్టర్ డ్రైవర్ సాయాన్ని కోరాడు. ఆ క్రమంలో వెనుక వైపు అత్తాపురం సంజీవరెడ్డి నిల్చున్న విషయాన్ని గమనించకుండా, నిర్లక్ష్యంగా సదరు డ్రైవర్ ట్రాక్టర్‌ను వెనక్కి తీశాడు. దాంతో ట్రాక్టర్ వెనుక భాగంలోని ట్రాలీ టైరు ఒక్కసారిగా సంజీవరెడ్డి మీది నుంచి వెళ్లింది. తీవ్రంగా గాయపడిన అతడిని హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.దేవేందర్ తెలిపారు.

## టిప్పర్ ఢీకొని రైతు దుర్మరణం

- ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం
- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువుల ఆందోళన


దేవరకొండలో రహదారిపై ఆందోళన చేస్తున్న పంతు బంధువులు

దేవరకొండ : టిప్పర్ ఢీకొని ఓ రైతు దుర్మరణం చెందాడు. ఈ ఘటన దేవరకొండ పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలం వద్యతండా గ్రామపంచాయతీ పరిధి కారోబార్‌తండాకు చెందిన నేనావత్ పంతు(52) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వరిచేనుకు క్రిమిసంహారక మందు కొనేందుకు శని వారం దేవరకొండ పట్టణానికి బైక్‌పై వచ్చాడు. పట్టణంలోని బస్టాండు సమీపంలోకి రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్ వాహనం బలంగా పంతు బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో రోడ్డుపై పడిన పంతుమీద నుంచి టిప్పర్ వాహనం వెళ్లడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు.

**న్యాయం చేయాలని బంధువుల ఆందోళన**

పంతు మృతి విషయం తెలుసుకున్న అతడి బంధువులు, తండావాసులు పెద్ద ఎత్తున దేవరకొండకు చేరుకొని రోడ్డుపై ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రమాదానికి కారణమైన వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు రెండు గంటలకు పైగా మృతుడి బంధువులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని హామీనివ్వడంతో మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సరైన స్పందన రాకపోవడంతో మృతుడి బంధువులు రాత్రి మరోసారి దేవరకొండ ప్రభుత్వాస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేస్తామని పోలీసులు హామీనివ్వడంతో శాంతించారు. ఈ ఘటనపై రాత్రి వరకు ఫిర్యాదు అందలేదని, ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని సీఐ నాగభూషణరావు తెలిపారు.


ఘటనాస్థలంలో పంతు మృతదేహం